సెయింట్ ఆన్స్ విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు

విశాలాంధ్ర - మల్కాపురం : స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథక వాలంటీర్లు కుమారి పి.దివ్యశ్రీ, ఇ.స్రవంతి మరియు కె.యామినిలకు లికృత్రిమ మేధస్సు - బాధ్యతాయుత వినియోగం అనే అంశంపై జరిగిన వక్తృత్వ పోటీలో పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ వారు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమం ద్వారకా నగర్‌లోని పౌర గ్రంథాలయంలో గల సెమినార్ హాల్లో నిర్వహించబడింది. కార్యక్రమానికి విశ్రాంతి ఐ.పి.ఎస్. అధికారి శ్రీ వి.వి.లక్ష్మీ నారాయణ విచ్చేసి ప్రశంసా పత్రాలను అంద జేశారు. కార్యక్రమాన్ని హెచ్.పి సి.ఎల్. విశ్రాంత ప్రజా సంబంధాల అధికారిఎం. కె.వి.ఎల్. నరసింహం నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా

మే 10, 11 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు

పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ : మే 10, 11 తేదీల్లో నగరంలోని మురళి నగర్ లో జరుగనున్న సిపిఐ విశాఖ జిల్లా 25 మహాసభలని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా సమితి నగర ప్రజానికానికి విజ్ఞప్తి చేసింది. మహాసభల సందర్భంగా రూపొందించిన గోడ పత్రికలను సిపిఐ జిల్లా నాయకత్వం మంగళవారం అల్లిపురం జిల్లా పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడి రాజు మాట్లాడుతూ విశాఖ నగరం చుట్టుపక్కల ఉన్న విలువైన ప్రభుత్వ భూములు కాపాడేందుకు పార్టీ అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. సింహాచలం దేవస్థానం, పంచ గ్రామాల భూసమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల నుండి విడుదలవుతున్న కాలుష్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడే పోరాటాలకు సిద్ధం కానున్నట్టు తెలిపారు. జిల్లాలో అర్హులైన పేద ప్రజలందరికీ పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు ఇచ్చి, ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయిలు మంజూరు చేయాలని కోరారు. టిడ్కో ఇళ్ళను త్వరితగతిన పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించి లబ్దిదారులకు అప్పగించాలన్నారు. నగరంలో సమస్యలను మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యక్రమాలను సిద్ధం చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎం.మన్మధరావు, జి.రాంబాబు, సిఎన్ క్షేత్రపాల్ రెడ్డి, ఎస్.సూరిబాబు, జి.కాసులరెడ్డి, ఎస్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

విశాఖ జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షులు కాసుబాబు

విశాలాంధ్ర - విశాఖ : కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, కార్మికులకు నష్టం కలిగించే విధంగా నాలుగు లేబర్ కోడ్లుగా మార్చారని విశాఖ జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షులు సీహెచ్.కాసుబాబు విమర్శించారు. శ్రీ కొత్తమాంబ కైలాసగిరి మ్యాక్స్ స్టాండ్ డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోటార్ కార్మికుల పీకకు ఉరి తగిలించే విధంగా ఉన్న జీవో నెంబర్ 21, 31లను రద్దు చేయాలని, భారీగా పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, ఆర్టీఏ చలానా ఛార్జీలను తగ్గించాలని, రోజువారీ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలని, మోటార్ కార్మికుల ఆదాయానికి గండి కొట్టే ఊబర్, రాపిడో సంస్థలను ఎత్తివేయాలని కోరారు. జాతీయ అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపులో భాగంగా మే 20 వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో మోటర్ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ కొత్తమాంబ కైలాసగిరి మ్యాక్సీ స్టాండ్ సంఘం ప్రెసిడెంట్ యు.ఎల్లాజీ, వైస్ ప్రెసిడెంట్, యు.తాతారావు, సెక్రెటరీయు. సోమేశ్, జాయింట్ సెక్రెటరీ యు.రామదాసు, ట్రెజరర్ పోలారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ భరత్‌ను కలిసిన చిట్టివలస జూట్ మిల్స్ అండ్ ఆల్ పెన్షనర్ సంఘం సభ్యులు

విశాలాంధ్ర - తగరపువలస : విశాఖపట్నం జిల్లా పార్లమెంటు సభ్యులు భరత్ ను చిట్టివలస జ్యూట్ మిల్స్ అండ్ ఆల్ ఫన్షనర్స్ సంఘము నుండి కార్యవర్గం నాయకులు అలాగే స్థానిక టిడిపి నాయకులు పెట్లా సురేష్, దేవుళ్ళు ఆయన ఆఫీసులో కలిశారు. ఈపీఎఫ్ 95 పెన్షన్ పెరుగుదలపై ఎంపీ భరత్ కి వివరించి చెప్పగా ఆయన స్పందించి తన వంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు. ఇప్పుడున్న ధరలకు అనుగుణంగా పెన్షన్ పెంచవలసిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని ఒకపక్క ధరలు విపరీతంగా పెరిగి పోతున్న సందర్భంలో జీవన గడపడం చాలా కష్టమని భరత్ కు తెలియజేశారు. రైల్వే ప్రయా ణాలు కూడా పెన్షనర్స్‌కు ప్రయాణ చార్జీలు రాయితీ కల్పించాలని అలాగే హెల్త్ విషయంలో కూడా కూడా ప్రత్యేక కార్డులు జారీ చేయాలని ఎంపీను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్య క్షులు జిల్లా నాయకులు ఎస్కే హుస్సేన్ అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు బాబాజీ అప్పల రాజు అప్పారావు సూర్యనారాయణ పాల్గొన్నారు.

వీధివిక్రయదారుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయిదారుల కార్మిక ఫెడరేషన్ (ఏఐటీయూసీ) విశాఖలో వీధి విక్రయదారుల సమస్యలపై విశాఖ జిల్లా కలెక్టర్‌కి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు సారాధ్యంలో వినతి పత్రం అందజేశారు. వీధి విక్రయదారుల చట్టం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన137, సెక్షన్ (ఏ) 4/2 రూల్స్ ప్రకారంగా బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నికలు వీధి విక్రయ దారులు 40 శాతం ఉన్న టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులును ఎన్నుకునే హక్కు కల్పించాలనీ, ఎన్నికలు వెంటనే జరపాలని, 2013 నుండి 2025 వరకు జీవీఎంసీ లో ఉన్న 8 జోన్ల లో అనేక అవినీతి అక్రమాలు జరిగాయని, దీనిపై రాష్ట్ర వీధివిక్రయదారుల కార్మిక యూనియన్లు తో టౌన్ వెండింగ్ కమిటీ లో ఉన్న 60 శాతం అధికారులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మహిళా కళాశాల ఎదురుగా ఉన్న ఫుడ్ కోర్ట్ లో జరిగిన అక్రమాలపై వెంటనే విచారణ జరపాలని కోరారు. జీవీఎంసీ 8 జోన్లలో 50, 222 గుర్తింపు కార్డులు ఇచ్చినట్లు ఆన్లైన్లో చూపిస్తున్నారని, ఇది తప్పు అని, గుర్తింపు కార్డులు కోసం ప్రతిసారి 200 మూడుసార్లు వసూలు చేశారని ఆ డబ్బంతా యు సి డి అధికారులు తినేసారని వెంకటేశ్వరరావు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న వీధివిక్రయదారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెడ్డు వెంకటేశ్వరరావు రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి చింతపల్లి పద్మరాజు, విశాఖ జిల్లా కన్వీనర్ భీంపల్లి రాము, విశాఖ జిల్లా కో కన్వీనర్ కాసరపు సత్యనారాయణ, విశాఖ జిల్లా ఏఐటీ యూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు వీధివిక్రయధాలు ఈ ఫిర్యాదు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీజ్ చేసిన మోటార్ వాహనాలు యజమానులకు అందజేత

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్ : విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రత్యేకమైన వాహన మేళా ద్వారా వివిధ కేసుల్లో రికవరీ చేసిన 320 వాహనాలను వాటి యజమానులకు తిరిగి అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ కార్యక్రమం జరిగింది. ట్రాఫిక్ విభాగం నుండి 72, క్రైమ్ మరియు లా అండ్ ఆర్డర్ విభాగాల ద్వారా 48 వెరసి మొత్తంగా 320 స్వాధీనం చేసుకున్న వాహనాలను ఎటువంటి ఆర్థిక భారం లేకుండా బాధితులకు అందించడం విశేషం. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, వాహనాల యజమానుల వివరాలను ఆర్టీఓ మరియు పోలీస్ స్టేషన్ రికార్డుల నుండి సేకరించి, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ద్వారా వారిని గుర్తించి సంప్రదించామని తెలిపారు. ఇది రెండవ వాహన మేళా అని, ఇంతకుముందు ఫిబ్రవరి 19, 2025న 152 వాహనాలను తిరిగి ఇచ్చామని ఆయన వెల్లడించారు. నేటి మేళాతో కలిపి మొత్తం 472 మంది బాధితులు లబ్ధి పొందారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పౌర సంక్షేమానికి విశాఖపట్నం సిటీ పోలీస్ చేస్తున్న కృషికి నిదర్శనమని ఆయన అన్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, సామర్థ్యాన్ని ఈ చర్య చాటుతుందని ఆయన తెలిపారు.

ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీని వినియోగించుకున్న లైన్స్ క్యాన్సర్ హాస్పటల్

జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లింపు దారులు తమ ఆస్తి పన్నును ఒకేసారి చెల్లించిన యడల 5 శాతం రాయితీను రాష్ట్ర ప్రభుత్వం కల్పించినందున విశాఖపట్నం లైన్స్ క్యాన్సర్ హాస్పిటల్ యాజమాన్యం తమ ఆస్తి పన్నును 5 శాతం రాయితీను వినియోగించుకుని తమ ఆస్తి పన్ను చెక్కును రూ.1,14,239/-లు అందించిందని జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణ మూర్తి మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఆస్తి, ఖాళీ జాగా పన్నుపై రాయితీని లైన్స్ క్యాన్సర్ హాస్పిటల్ వారు వినియోగించుకొని ఆస్తి పన్ను చెల్లించారని వీరిని ఆదర్శంగా తీసుకొని మరికొన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, తమ ఆస్తి పన్నులను చెల్లించి 5 శాతం రాయితీ పొంది విశాఖ నగరాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ జాగా పన్నులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం రాయితీ 2025 ఏప్రిల్ 30తో ముగుస్తుందని, అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరం సంబంధించి ఆస్తిపన్నుపై వడ్డీపై రాయితీను 50 శాతం 2025 ఏప్రిల్ 30 వరకు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించినందున ఆస్తి, ఖాళీ జాగా పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కమిషనర్ తెలిపారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులు తమ ఆస్తి పన్నును Online ద్వారా గాని, జీవీఎంసీ అన్ని సౌకర్యం కేంద్రాల్లో, సంబంధిత బ్యాంకుల్లో, సచివాలయాలలో క్రెడిట్, డెబిట్, యూపీఐ, నగదు, చెక్కుల ద్వారా పన్నులు చెల్లించుకునే సౌకర్యాన్ని వినియోగించుకొని విశాఖ నగర అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా శ్రీ పెంటమాంబ అమ్మవారి మారువారం పండుగ మహోత్సవం

విశాలాంధ్ర - పెదగంట్యాడ : ఉక్కు నిర్వాశితుల ఆరాధ్య దైవం శ్రీ పెంటమాంబ అమ్మవారి పండుగ, సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి పండుగకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కోశాధికారి పిట్ట కుంచరావు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి, వీఎంసి కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి, జనసేన నాయకులు తిప్పల రమణారెడ్డి తో పాటు స్థానిక నాయకులు, నెల్లిముక్కు గ్రామ పంచాయతీ పరదిలోని భక్తులు అమ్మవారి దర్శనానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ పెంటమాంబ ఆలయ కమిటీ డైరెక్టర్ లు గోండేశీ మహేశ్వర రెడ్డి, పులి రమణారెడ్డి, గోండేశీ అప్పలరెడ్డి, సత్యరావు, యేల్లేటి శ్రీనివాస రావు, కెఎన్ రెడ్డి, గంట్యాడ పైడిరాజు, మొల్లి రమణ లు పాల్గొని పండుగ ఏర్పాట్లు పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమం లో భాగంగా ఆలయ కమిటీ సభ్యుల ఆర్థిక సహాయం తో ఆలయ ఆవరణలో డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం నిర్వహించారు.

కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - ఆనందపురం : ఉపాధి కూలీల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు, భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ ఎస్ ఎన్ మూర్తి పేర్కొన్నారు. ఆనందపురం మండలం కుసలవాడ పంచాయతీ రేగాని గూడెం గ్రామం ఉపాధి కూలీలు పనిచేస్తున్న చెరువులోకి వెళ్లి వారితో మాట్లాడారు ఈ సందర్భంగా పలువురు ఫిబ్రవరి నెల నుండి వేతనాలు అందలేదని, ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు పనిచేసినప్పటికీ 70 రూపాయల నుంచి 100 రూపాయల లోపు మాత్రమే డబ్బులు పడుతున్నాయని కూలీలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉన్న లోపాలని సరిచేసి కూలీలకు సరిపడా వేతనం వచ్చేటట్టు అమలు చేయాలని కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఒక ఏడాదికి రెండు వందల రోజులు పని కల్పించాలని రోజుకి 700 రూపాయల వేతనం ఇవ్వాలని పని ప్రదేశంలో టెంట్స్ వేయాలని మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వ నాయకులు కే నాగరాణి మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి కూలీల కుటుంబాలకు వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించాలని కూలీల పిల్లలకు స్కాలర్షిప్ ఇవ్వాలని జాబ్ కార్డులు లేని వారికి వెంటనే జాబ్ కార్డులు ఇవ్వాలని తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపుగా 150 మంది కూలీలు నాయకులు ఆదినారాయణ, పెంటారావు, లక్ష్మణరావు, లక్ష్మి, సన్యాసమ్మ, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్

విశాలాంధ్ర - ఆనందపురం : మండలంలో నెల్లేరు గ్రామంలో గల కేజీబీవీ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా సమగ్ర శిక్షా ఎపిసి డాక్టర్ జె.చంద్రశేఖర్ రావు జీసిడిఓ కాలేషా బేగం, పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య రాష్ట్ర సమన్వయ కర్త రుషి అద్వర్యంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. విద్యార్థుల వృత్తి విద్యా కోర్సులో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్‌లో సమ్మర్ ఇంటర్న్‌షిప్ లో ఆనందపురం వేములవలసలో శ్రీ బాలాజీ బేకరీలో విద్యార్థులు క్రాఫ్ట్, బేకరీ (కేకులు, కుకీ, పాస్టీస్) పైప్రాక్టికల్స్ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్ష 10 రోజులు పూర్తి అయిన సందర్భంగా వృత్తి విద్యలో ఇంటర్న్‌షిప్ సర్టిఫికేట్ వృత్తి విద్యా ధృవీకరణ పత్రం కింద వీరి చేతుల మీదగా విద్యార్థులకు అందించి విద్యార్థులకు అభినందనలు తెలియజేసారు. ఈ వృత్తి కోర్సులో విద్యార్థుల క్యారియర్‌లో చాలా ఎక్కువ ఉపయోగకరమని తెలిపారు.

ఏప్రిల్ 28న జీవీఎంసీ మేయర్ పదవికి ఎన్నిక

- మేయర్‌గా హరి వెంకట్ కుమారి పదవిని రద్దు చేసిన ప్రభుత్వం
- నోటిఫికేషన్‌ను జారీ చేసిన ఎలక్షన్ కమిషనర్
- విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్చార్జ్ కమిషనర్ ఎమ్ఎన్.హరేందిర ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ పదవికి ఎన్నికను 2025 ఏప్రిల్ 28వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలను జారీ చేశారని విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్చార్జి కమిషనర్ ఎమ్ఎన్.హరేందిర ప్రసాద్ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. సదరు నోటిఫికేషన్ ప్రకారం 24.04.2025 తేదీ లోపల మేయర్ ఎన్నికల షెడ్యూల్ ను ఫారమ్-2 ప్రకారం మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు ఎన్నికైన సభ్యులకు ఎక్స్-ఆఫీషియో సభ్యులకు మేయర్ ఎన్నికల నిమిత్తం ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని నోటీసు ఇవ్వడం జరుగునని, మేయర్ ఎన్నికల కోసం ప్రత్యేక సమావేశం తేదీ: 28.04.2025, ఉదయం 11:00 గంటలకు నిర్వహించడం జరుగునని కలెక్టర్ తెలిపారు. మరోపక్క ఈనెల 19వ తేదీన ప్రత్యేక అవిశ్వాస కౌన్సిల్ సమావేశంలో అవిశ్వాసం నెగ్గడంతో ప్రభుత్వానికి నివేదించిన కలెక్టర్ నివేదికను ఎన్నికల సంఘం ఆమోదించి మేయర్‌గా హరి వెంకట కుమారిని రద్దు చేసినట్లు ఆదేశాలు జారీ చేసింది.

కార్మికోద్యమ వేగు చుక్క లెనిన్

సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ : ప్రపంచ కార్మికోద్యమ వేగు చుక్క కామ్రేడ్ లెనిన్ అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. ఉల్లిపురం లోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం లెనిన్ 155 వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం కార్మికులారా ఏకం కండి అని మార్క్స్ ఇచ్చిన పిలుపును అందుకొని రష్యాలో తొలి సోషలిస్టు ప్రభుత్వాన్ని లెనిన్ నిర్మించారని పేర్కొన్నారు. లెనిన్ నాయకత్వంలో జరిగిన అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయం సాధించిన తరువాత. ప్రపంచంలో అనేక దేశాల్లో విముక్తి ఉద్యమాలు ఊపందుకున్నాయన్నారు. లెనిన్ మహనీయుడు చూపిన పోరాట స్ఫూర్తి భారత కమ్యూనిస్టు ఉద్యమంపై గొప్ప ప్రభావాన్ని చూపిందని, ఇప్పటికీ అది కొనసాగుతున్నదని పేర్కొన్నారు. దోపిడీ శక్తులను అంతం చేయడం ద్వారానే శ్రామిక జనావళికి విముక్తి జరుగుతుందని నిరూపించిన లెనిన్ స్ఫూర్తిని అందుకొని సిపిఐ పని చేస్తున్నదని పేర్కొన్నారు. ఆ మహనీయుని జీవితాన్ని అధ్యయనం చేయడం ద్వారా అయన అందించిన స్ఫూర్తిని కొనసాగిద్దామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె సత్యనారాయణ, కె సత్యాంజనేయ, ఎం మన్మధరావు, జి రాంబాబు, సి ఎన్ క్షేత్రపాల్ రెడ్డి, ఎస్ సూరిబాబు, జి కాసులరెడ్డి, ఎన్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఉక్కును ప్రైవేటికరిస్తే ప్రతిఘటన తప్పదు : ఆదినారాయణ

విశాలాంధ్ర - గాజువాక : ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీ కరిస్తే ప్రతిఘటన తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ హెచ్చరించారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే దీక్షలు మంగళ వారం 1531 వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో రోలింగ్ మిల్స్ విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం 32 మంది ప్రాణ త్యాగం చేశారని, త్యాగాల పునాదుల మీద ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసే హక్కు కేంద్రానికి లేదని అన్నారు. పోరాట కమిటీ మరో చైర్మన్ మంత్రి రాజ శేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మా లని కుటిల ప్రయత్నాలను ముమ్మరం చేసిందని, ఈ ప్రయత్నాలను పోరాటాల ద్వారా అడ్డుకుంటామని అన్నారు. ఇంకా ఈ దీక్షల్లో ఏఐటియూసి నాయకులు ఏ.మసేన్‌రావు, డి.దేముడు, జి.ఆనంద్, వర్మ, డి.రమేష్, రాజేశ్వర్ రావు, కె.రాంబాబు, జి.రమేష్, అమ్మోరు, అప్పలరాజు, బోండా మహేష్, కార్మిక నాయకులు దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్ అవిశ్వాస ఎన్నికలో ఓటు వేసిన వైసీపీ కార్పొరేటర్లపై చర్యలు తీసుకోవాలని కల్టెకర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : ఈ నెల 19వ తేదీన గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టిన సందర్భంలో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది కార్పొరేటర్లను ప్రలోభపెట్టి సుమారుగా 27 మంది కార్పొరేటర్లు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా అవిశ్వాసానికి ఓటు వేయడం జరి గిందనీ తైనాల విజయకుమార్ కలెక్టర్‌కి తెలియజేశారు. వారంతా పార్టీ విప్‌కు అనుసరణగా కాకుండా వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ నేపథ్యంలో, పార్టీ జారీ చేసిన విప్‌ను ఉల్లంఘించిన వారిపై మున్సిపల్ కార్పొరేషన్ నియమాల కింద రూల్ 14 ప్రకారం కలెక్టర్ గారికి ఫిర్యాదు చేయడం జరిగింది. ఆ 27 మంది కార్పొరేటర్లకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున వేరువేరుగా విప్‌లు జారీ చేయబడ్డా యన్నారు. అయినప్పటికీ వారు వ్యతిరేకంగా ఓటు వేశారు అనే విషయాన్ని కౌన్సిల్ మీటింగ్ రికార్డుల్లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఆ రికార్డుల నకలును పరిశీలించి, వారి మీద తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆధారాలతో కలెక్టర్ ని కోరడం జరిగిందన్నారు. మేము కోరేది ఒక్కటే న్యాయబద్ధంగా, చట్టంలో పేర్కొన్న విధంగా చర్యలు తీసుకోవాలనీ, మా పిటిషన్‌ను సమీక్షించి, గతంలోని ప్రస్తావనలు పరిశీలించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడే విధంగా, రాజకీయ లావాదేవీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. పార్టీ కార్యాలయ పర్యవేక్షకులు రవి రెడ్డి, పార్టీ నాయకులు కిరణ్ రాజు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

వీధి సుబ్రమణ్యం హత్య కేసుపై సిట్ హర్షణీయం

మిగిలిన అట్రాసిటీ కేసుల్లో కూడా పునర్విచారణ చేయాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : దళిత యువకుడు వీధి సుబ్రమణ్యం ను హత్య చేసిన వైసిపి ఎమ్మెల్సీ అనంత బాబు కేసుపై ఐపీఎస్ అధికారి దినేశ్ దేవరాజ్ పాటిల్‌తో ప్రత్యేక దర్యాప్తు కు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడాన్ని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక హర్షాన్ని వెల్లుబుచ్చింది. ఈ సందర్భంగా విదసం, బహుజన సేన, భీమ్ సేన, బీఎస్ ఐ సంఘాల నేతలు పబ్లిక్ లైబ్రరీలో సమావేశం అయ్యారు. విదసం నేత డాక్టర్ బూసి వెంకట రావు మీడియా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం దళితుల పై చేసిన హత్యలు, దాడులపై గత ఏడాది అక్టోబర్ లో అమలాపురం లో బాధిత కుటుంబాలు అన్నిటిని విదసం ఒకే వేదిక మీదకు తెచ్చి పునర్విచారణ కోరిన విషయం గుర్తు చేశారు.. విదసం ద్వారా బాధితులు చేసిన విజ్ఞప్తి పై ప్రభుత్వం స్పందించడం సంతోషం అన్నారు. బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు చందు మాట్లాడుతూ డాక్టరు సుధాకర్ హత్య కేసును మళ్ళీ విచారించాలని, కోడి కత్తి కేసులో కుట్ర కోణం లేదని ఎన్ఐఏ స్పష్టం చేసినందున ఏపి పోలీసుకు బదిలీ చేసి కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని, వెంకటయి పాలెం శిరో మండనం కేసులో బెయిల్ మీద ఉన్న తోట త్రిమూర్తులు పై హైకోర్టు లో క్రాస్ అప్పీల్ వేయాలని అలాగే అమరావతి ఉద్యమ దళితుల పై పెట్టిన అట్రాసిటీ కేసులు బేషరతుగా ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొరమాటి చిన్నారావు, జాజి ఓంకార్, రూపక నాయక్, మల్లయ్య రాజు, బొడ్డు కృష్ణ, రవిసంతోస్, పాల్గొన్నారు.

ఎండాడ రైతు బజార్ స్థల పరిశీలన

రుషికొండ జంక్షన్‌లో కళ్యాణ మండపానికి గంటా ఆదేశం

విశాలాంధ్ర - సాగర్ నగర్ : ఎండాడ, సాగర్ నగర్ తదితర ప్రాంత ప్రజల సౌకర్యార్థం రైతు బజార్ ఏర్పాటు చేయడానికి చురుకుగా ప్రయత్నాలు జరుగుతున్నాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. రైతు బజార్ స్థలాన్ని ఎంపిక చేయడం కోసం మంగళవారం ఎండాడ, సాగర్ నగర్ పరిసరాల్లో అందు బాటులో ఉన్న ప్రభుత్వ భూములను ఆయన పరిశీలించారు. మెయిన్ రోడ్డులోని ఎం.కె.గోల్డ్ కోస్ట్ వెనుకనున్న స్థలంతో పాటు సుభాష్ నగర్ కమ్యూనిటీ హాల్ వెనకనున్న స్థలాన్ని కూడా సందర్శించారు. సాధ్యాసాధ్యాల గురించి చర్చించారు. రైతు బజార్ కు వచ్చే వారికి రోడ్డు, పార్కింగ్ వంటి సౌకర్యాల విషయంలో రాజీ ఉండకూడదన్నారు. ఎం.కె. గోల్డ్ కోస్ట్ వెనక ఖాళీగా ఉన్న పార్కు స్థలంలో ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా వంటి వసతులు అభివృద్ధి చేయాలని సూచించారు. ఎండాడ మెయిన్ రోడ్డు పై వాహన రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో రోడ్డు పక్కన అనధికార షాపులు నడిపే వాళ్లకు అక్కడే ఉన్న ప్రభుత్వ భూమిలో షాపింగ్ కాంప్లెక్ నిర్మించి ఇచ్చే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రుషికొండ జంక్షన్ లో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను తొలగించి అక్కడి ప్రజలు కోరుతున్నట్టుగా కళ్యాణ మండపాన్ని నిర్మించాలని చెప్పారు. గొల్లలపాలెం స్కూల్ ఆవరణలో ఉన్న తుపాను షెల్టర్ ను తక్షణమే తొలగించాలన్నారు. ఆర్డీఓ సంగీత్ మాథుర్, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్ లొడగల అప్పారావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టిపల్లి గోపీ, సారిపల్లి శ్రీనివాస్, జనసేన అధ్యక్షుడు శాఖారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన దొంగలు అరెస్టు

విశాలాంధ్ర - పెందుర్తి : విశాఖ సిటీ పరిధిలోని పలు ప్రాంతాలలో మోటార్ సైకిళ్లను దొంగిలించి ఒడిశాలో విక్రయించడానికి ప్రయత్నించిన తోటాడ నితిన్ కుమార్ అనే యువకుడితో పాటు మరో ఇద్దరు బాలురును పెందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 11 లక్షలు విలువ గల 16 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు క్రైమ్ ఏడిసిపి మోహన్ రావు తెలియ జేశారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు సిఐ శ్రీనివాసరావు ఎస్ఐ సూరిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్రంథాలయ పునర్వికాస మహాసభ లోగో ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ : గ్రంథాలయ పునర్వికాస మహాసభ లోగోను బుధవారం ఉదయం 9.30 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస వేదిక శాఖ జిల్లా శాఖ కన్వీనర్ బను పోతన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న విజయవాడలో భారీ ఎత్తున జరుగుతున్న గ్రంథాలయ పునర్వికాస మహాసభకు విశాఖ నుండి బయలుదేరు కార్యకర్తలంతా కలిసి లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని, విశాఖ నుండి బయలుదేరుతున్న గ్రంథాలయ పునర్వికాసవేదిక ప్రతినిధులకు తమ సంఘీభావం తెలియజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి నగరంలోని పుస్తక ప్రేమికులు, రచయితలు, మేధావులు వచ్చి తమ మద్దతు తెలియజేయాలని కోరారు.

ఒక్కరితోనే సరిపెట్టొద్దు... ఇద్దరు కంటే ఎక్కువ సంతానానికి ప్రాధాన్యం ఇవ్వండి

పోషణ్ పఖ్వాడా -2025 రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జనాభా వృద్ధి సిద్ధాంతాన్ని, మేనేజ్మెంటు విధానాన్ని అర్థం చేసుకొని అధిక సంతానానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ఒక్కరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కనాలని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఒకప్పుడు ఇద్దరు ముద్దు అనే వారని, రానురాను ఇద్దరు వద్దు ఒక్కరే ముద్దుగా మారిందని, ఇప్పుడు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇద్దరు లేదా ముగ్గురు, అంతకంటే ఎక్కువ అనే నినాదాన్ని ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలున్నా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు ఆగవని, సంక్షేమ పథకాలపై ప్రభావం ఉండబోదని మంత్రి స్పష్టం చేశారు. దీనికి సంబంధించి అధికారిక ఉత్తర్వు కూడా వెలువడినట్లు మంత్రి గుర్తు చేశారు. విశాఖపట్టణంలోని ఉడా చిల్డ్రన్ ఏరినాలో మంగళవారం జరిగిన పోషణ్ పఖ్వాడా -2025 రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి అభిమతమని దానిలో భాగంగా ఇప్పటికే మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నారని మంత్రి సంధ్యారాణి గుర్తు చేశారు. అంగన్వాడీ కార్యకర్తలకు, ఆశాలకు గ్రాట్యుటీ, మట్టి ఖర్చుల విషయంలో సానుకూలంగా వ్యవహరించారని, వివిధ రకాల నిధులు మంజూరు చేశారని చెప్పారు. అందుకే చంద్రబాబు నాయుడు మహిళా పక్షపాతిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను అర్థం చేసుకొని క్షేత్రస్థాయి సిబ్బంది కష్టపడి పని చేయాలని ఐసీడీఎస్, వైద్యారోగ్య శాఖల అధికారులు సమన్వయం వహించి సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. అంగన్వాడీల ద్వారా క్రమం తప్పకుండా గర్భిణులకు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, పర్యవేక్షించాలని చెప్పారు. పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా మొదటి 1000 రోజులు పిల్లల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. ఊబకాయం లేని పిల్లలు ఉండేలా, ఆరోగ్యకర వాతావరణంలో పెరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పోషణ్ ట్రాకర్, సమాజ స్థాయిలో తీవ్రమైన, మితమైన పోషక లోపాలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించడానికి నిర్దేశించిన మాడ్యూల్‌ను అమలు పటిష్టంగా అమలు చేయాలని నిర్దేశించారు. గిరిజన ప్రాంతాలతో (40 శాతం) పోలిస్తే మైదాన ప్రాంతాల్లో (70 శాతం) సిజేరియన్లు అధికంగా ఉంటున్నాయని ఈ పరిస్థితి మారాలని, సాధారణ ప్రసవాలు అధికంగా జరగాలని ఆశా భావం వ్యక్తం చేశారు.

పిల్లల పెంపకం విషయంలో పక్షపాతం వద్దు...

పిల్లల పెంపకం విషయంలో పక్షపాతం ప్రదర్శించరాదని, ఆడ, మగ అనే తేడా ఎట్టిపరిస్థితుల్లోనూ చూపించరాదని తల్లిదండ్రులకు మంత్రి హితవు పలికారు. ఇద్దరికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, మంచి విలువలు నేర్పించాలని సూచించారు. టీవీ, ఫోన్ల వినియోగానికి పెద్దలు దూరంగా ఉంటూ పిల్లల్ని కూడా దూరంగా ఉంచాలన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అందించాలని సూచించారు. వారి ముందు తప్పులు చేయరాదని హితవు పలికారు. జపాన్ దేశంలో మాదిరిగా ఇక్కడి పిల్లలకు కూడా ఆరోగ్యకర అలవాట్లను నేర్పించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. అక్కడ పిల్లలకు సైక్లింగ్, వ్యాయామం తప్పకుండా చేయిస్తారని గుర్తు చేశారు. పిల్లల్ని టీవీలకు, ఫోన్లకు దూరంగా ఉంచుతారని చెప్పారు. ఆరోగ్యకర అలవాట్లు, క్రమశిక్షణతో ఉండటంలో వల్ల అక్కడి పిల్లల్లో ఊబకాయం, ఇతర అనారోగ్య సమస్యలు కనిపించవని గుర్తు చేశారు. ఇక్కడి పిల్లల్లో కూడా అలాంటి మంచి లక్షణాలను పెంపొందించటం ద్వారా మంచి ఫలితాలు ఆశించవచ్చని కలెక్టర్ అన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండటం ద్వారా ఆర్థిక పేదరికం రాదని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ను రూపొందించవచ్చని, స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. కమ్యూనిటీ భాగస్వామ్యం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందిస్తున్న విధానాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఎనీమియా, ఊబకాయం లేని విధంగా, మాతా శిశు మరణాలు సంభవించని విధంగా అందరూ సమష్టి కృషి చేయాలని పేర్కొన్నారు. ఐసీడీఎస్, యూడీసీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా అధికారులు, మంత్రి ఐసీడీఎస్ సిబ్బంది తయారు చేసిన వివిధ రకాల పోషకాహారాల స్టాళ్లను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్లకు చేరుకొని సెల్ఫీలు తీసుకున్నారు. పోషణ్ పఖ్వాడా 2025కు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించి, అందరూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కళాజాత బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ. సూర్యకుమారి, డైరెక్టర్ వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, టాటా సౌజన్యంతో నడుస్తున్న విజయ వాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధి ఆర్. రాజేంద్ర బాబు, యునిసెఫ్ ప్రతినిధి రేషా ఎన్ దేశాయ్, ఐసీడీఎస్ జేడీ చిన్మయిదేవి, పీడీ జయదేవి, యూనిసెఫ్ పీడీ సుజాతవేణి, డీఎం%హెచ్ఓ పి. జగదీశ్వరరావు, ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కె 13 5జి ని విడుదల చేసిన ఒప్పో

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఒప్పో కె 13 5జి ని ఒప్పో ఇండియా విడుదల చేసింది. ఇది విద్యుత్ సామర్థ్యం, ప్రీమియం వినియోగదారు అనుభవంతో "ఓవర్ పవర్డ్" పనితీరు అనుభవాన్ని అందించేలా తయారు చేశారు. స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 4 మొబైల్ ప్లాట్‌ఫామ్‌తో నడిచే ఈ పరికరం 80 డబ్ల్యూ సూపర్ ఉక్ ఫాస్ట్ ఛార్జర్‌తో కూడిన 7000 ఎంఏహెచ్ గ్రాఫైట్ బ్యాటరీ, సెగ్మెంట్-లీడింగ్ వీ సీ కూలింగ్, ఇంటెలిజెంట్ నెట్‌వర్క్ ఆప్టిమైజేషన్‌ను కలిగి ఉంది ఇది మృదువైన మల్టీ టాస్కింగ్, ఇమ్మర్సివ్ గేమింగ్, దీర్ఘకాలిక బ్యాటరీ లైఫ్‌తో పాటు నమ్మకమైన కనెక్టివిటీని అందిస్తుంది. ఒప్పో కె 13 5 జీ తన విభాగంలో పనితీరును పునర్నిర్వచించేందుకు అధునాతన ఇంజనీరింగ్, శుద్ధి చేసిన డిజైన్‌తో కలిపి అర్థవంతమైన ఆవిష్కరణకు ఒప్పో నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. శక్తివంతమైన, నమ్మదగిన సాంకేతికతను ప్రజాస్వామ్యీకరించడం మరియు ఫ్లాగ్‌షిప్-స్థాయి లక్షణాలను గతంలో కంటే ఎక్కువ మంది వినియోగదారులకు అందుబాటులో ఉంచడం అనే ఒప్పో దృష్టిని ఈ పరికరం ప్రతిబింబిస్తుంది" అని వివరించారు.

కేఎఫ్‌సీ ఇండియా సరికొత్త సాసీ పాప్‌కార్న్

విశాలాంధ్ర - విశాఖపట్నం : కేఎఫ్‌సీ ఇండియా భారతదేశంలోని అతిపెద్ద జెన్‌జీ యూట్యూబర్ క్యారీమినాటితో తొలిసారి భాగస్వామ్యంతో సరికొత్త మెనూను అందుబాటులోకి తీసుకువచ్చింది. అపూర్వమైన ఆవిష్కరణలో క్యారీమినాటి (అకా అజే నగర్) కలిసి కేఎఫ్‌సీ ఇండియా అత్యుత్తమ, ఫింగర్ లికింగ్ చక్కని సాసీ పాప్‌కార్న్‌ను విడుదల చేసింది. కేఎఫ్‌సీ కిచెన్‌లోకి తొలిసారిగా, జెన్‌జీ ఐకాన్ ప్రవేశిస్తోంది. ప్రస్తుతం 67 మిలియన్ల మంది ఫాలోయర్లు ఉన్న క్యారీమినాటి ఉత్పత్తికి తన పేరును మాత్రమే ఇవ్వలేదు - అతను తన ట్రేడ్‌మార్క్ సాసీనెస్, తన సొంత అభిరుచిని (అక్షరాలా) కేఎఫ్‌సీ కిచెన్‌లోకి తీసుకువచ్చారు. కేఎఫ్‌సీ క్రాస్ క్యారీమినాటి సాసీ పాప్‌కార్న్ చికెన్ ప్రియులకు ఇష్టమైన బైట్ పరిమాణంలో ఉండే చికెన్ పాప్‌కార్న్ మరియు క్యారీ సాసీ వ్యక్తిత్వాన్ని అత్యంత లావుగా ఉండే విధంగా తయారైంది. చికెన్ పాప్‌కార్న్ ఐకానిక్ రుచిని స్పైసీ మరియు టాంగీ నాష్‌విల్లే సాస్‌లో కలపడం ద్వారా 'క్యారీ-ఎడ్'ను ముందుకు తీసుకువస్తోంది.

గణిత ఉపాధ్యాయులు కెజియా మేడమ్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తూ మే నెల 31న పదవీ విరమణ కానున్న వై.వి కెజియా మేడంకు మంగళవారం పాఠశాలలో సహచర ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ పట్టభద్రులు (ఎమ్మెల్సీ) గాదె శ్రీనివాసనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులకు పదవీ విరమణ సహజమని చేసిన పనులే స్థిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు 42 ఏళ్ల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో బాధ్యతలు స్వీకరించి ఎంతో మందిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయిని కెజియా సేవలు ప్రశంసనీయమన్నారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో గడపాలని ఆశీర్వదించారు. ఎంఈఓ-1 జోగేంద్రనాథ్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుని వృత్తి ఎంతో గౌరవప్రదమైనదన్నారు. ఆనందపురం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కేఆర్ కే పట్నాయక్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ నెల రోజులు ఉన్న పాఠశాలలు సెలవులు కావడంతో ఉపాధ్యాయులు విద్యార్థులు ఆమె సేవలను స్మరించుకొని సన్మానించడం అభినందనీయమన్నారు . 18 ఏళ్లకే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి 42 ఏళ్ళు సుదీర్ఘమైన విద్యను విద్యార్థులకు అందించి వారి మన్ననలు పొందడం పూర్వ విద్యార్థులు పాల్గొని సన్మానించడం ఆమె జన్మ ధన్యం అన్నారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు మహేష్ కె జియా మేడం జీవిత చరిత్ర , ఉపాధ్యాయ వృత్తిలో ఆమె చేసిన సేవలను సన్మాన పత్రం రూపంలో తయారుచేసి పద్య రూపంలో విన సొంపుగా వివరించారు. కెజియా మేడం భర్త అదే పాఠశాలలో పనిచేస్తున్న ప్రేమ్ కుమార్ ఉద్యోగినిగా గృహిణిగా ఆమె సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె గతంలో పనిచేసిన వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సహకార సంఘం అధ్యక్షులు చందక సూరిబాబు, ఎంపీటీసీలు బంటుబిల్లి అప్పలస్వామి, రెడ్డి బాబు, కొట్యాడ సత్యమూర్తి, ఎస్ఎంసి ఛైర్మన్ బంటుబిల్లి లక్ష్మి పాఠశాల ఉపాధ్యాయులు శంకర్రావు భాస్కరరావు, ప్రసాద్ కే వెంకటప్రసాద్ బంగారం,పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

గీతం పూర్వవిద్యార్థిపై స్ఫూర్తిదాయక చిత్రం

విశాలాంధ్ర - మధురవాడ : సివిల్ సర్వీసుల పట్ల విద్యార్థులలో ఆసక్తిని కలిగించడానికి, స్ఫూర్తిని నింపడానికి గీతం విశ్వ విద్యాలయం నుంచి ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసి ఐపిఎస్‌కు ఎంపిక అయి బీహార్ లో పోలీసు అధికారిగా విధులు నిర్వహిస్తూ భారత ప్రభుత్వం నుంచి ప్రతిష్ఠాత్మక గ్యాలంటరి అవార్డును అందుకున్న కె.సుహిత అనుపమ్ పై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం లఘు చిత్రాన్ని రూపొందించింది. బీహార్‌లోని కిరాతక హంతకుల మెడలు వంచిన మహిళా ఐపిఎస్ అధికారిగా ప్రశంసలు అందుకున్న కె.సుహిత అనుపమ్ దేశంలో భారత ప్రభుత్వ గ్యాలంటరి అవార్డు అందుకున్న మూడవ మహిళగా గుర్తింపు పొందటం విశేషం. జాతీయ సివిల్ సర్వీసుల దినోత్సవం సందర్భంగా కె.సుహిత అనుపమ్ ఆన్‌లైన్‌లో ప్రసంగించారు. 10వ తరగతి వరకు గుంటూరులో విద్యాభ్యాసం చేసిన తాను ఇంటర్ తరువాత గీతంలో ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసానని తెలిపారు. సివిల్ సర్వీసులలోకి ప్రవేశించాలన్న తన కోరికకు గీతం అధ్యాపకులు ఎంతో సహకరించారని తెలిపారు. సివిల్స్ మొదటి ప్రయత్నంలో ఇంటర్వ్యూలో విజయం సాధించడంలో తడబడిన రెండవ ప్రయత్నంలో విజయం సాధించినట్లు వెల్లడించారు. స్వయంగా తయారు చేసుకున్న నోట్స్ తనకు ఎంతో ఉపయోగపడిందని ముఖ్యంగా గీతంలో ఒక పక్క సివిల్ ఇంజనీరింగ్ చదువుతూ గీతం గ్రంథాలయంలో లభించే పుస్తకాలు, పత్రికల ద్వారా విషయ పరిజ్ఞానం పెంచుకున్నానని తెలిపారు. మిగిలిన పరీక్షలకు గీతంలో పొల్గొనే సివిల్ సర్వీసుల పోటిదారులతో జరుగుతాయని, సమయ పాలన, చుట్టూ ఉన్న సమాజంలో జరుగుతున్న విషయాలపై లోతైన అవగాహన, స్వయం విశ్లేషణ సివిల్స్‌లో ఎంతో ఉపయోగకరమన్నారు. తనకు చిన్నతనం నుంచి చరిత్ర, జాగ్రఫీ అంటే ఎంతో ఇష్టం అని అలాగే ఎక్కువగా నేషనల్ జియోగ్రఫిక్ ఛానల్ తరుచు వీక్షిస్తానని తెలిపారు. సివిల్స్‌లో తనకు ఇవి ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. పోటీ పరీక్షల పుస్తకాలు చదవడం, నమూనా ఇంటర్వ్యూలకు హాజరుకావడం, ముందు నుంచి లక్ష్యం పై స్థిరమైన అభిప్రాయంతో ఉండటం ద్వారా సివిల్స్‌లో విజయం సాధించవచ్చని తెలిపారు.

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అవినీతి అక్రమాలు కొండంత....

కూటమి కార్పొరేటర్లు ఆరోపణ...

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జీవీఎంసీ లో నాలుగేళ్ల పాటు షాడో మేయర్ గా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అవినీతి అక్రమాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ వందల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దోచేసారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ ఆరోపించారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం టీడీపీ ఫ్లోర్ లీడర్ ఛాంబర్ లో జీవీఎంసీ కూటమి కార్పొరేటర్లు,నేతల మీడియా సమావేశం నిర్వహించారు. మాజీ మేయర్ సబ్బం హరి దగ్గర సహాయకుడిగా ఉంటూ రాజకీయ అవకాశం దక్కి, కార్పొరేటర్ గా, డిప్యూటీ మేయర్ గా జియ్యాని శ్రీధర్ చేసిన అవినీతి అక్రమాలు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. మేయర్ హరి వెంకట్ కుమారి గొరంత అవినీతి చేస్తే, డిప్యూటీ మేయర్ శ్రీధర్ షాడో మేయర్ గా కొండంత అవినీతి చేశారని మండిపడ్డారు. మర్రిపాలెం ఉడా లేఅవుట్ లో బినామీ వ్యక్తితో 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడం నిజం కాదా అని ప్రశ్నించారు. నాలుగేళ్ళ వైసిపి పాలనలో టౌన్ ప్లానింగ్ విభాగాన్ని డిప్యూటీ మేయర్ శ్రీధర్ చేతుల్లో పెట్టుకొని కోట్లాది రూపాయలు సంపాదించారని ఆరోపించారు. రాష్ట్రంలో అనేకచోట్ల షాపులు ఉన్నాయని, విశాఖ నగరంలోని పదుల సంఖ్యలో షాపులు ఎలా కొనుగోలు చేశారని, ఏం వ్యాపారం చేసి సంపాదించారని, ఏం ఉద్యోగం ఉందని మూర్తి యాదవ్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో టిడిపి కార్పొరేటర్లు గంధం శీను, పల్లా శీను, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు వెంకటరమణ శర్మకు పురోహిత వైభవ రత్న అవార్డు!

విశాలాంధ్ర - పెందుర్తి : ప్రతి మనిషి పట్టుదల,కృషి ఉంటే ప్రతి ఒక్కరు ఏదో రంగంలో విజయం సాధిస్తారు అనడానికి నిదర్శనం ప్రముఖ వ్యాధి పండితులు ఆధ్యాత్మికవేత్త పురోహితులు బ్రహ్మశ్రీ ఏలూరు వెంకట రమణ శర్మ(రాజేష్ కుమార్ శర్మ). ఆధ్యాత్మికంగా ఆయన సమాజానికి అందించిన సేవలకు గాను సోమవారం బ్రాహ్మణ సంఘం పెద్దలు చేతుల మీదుగా పురోహిత వైభవ రత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రాజేష్ శర్మ గురించి వక్తలు మాట్లాడుతూ హైందవ సంస్కృతి సంప్రదాయాలను కాపాడమే కాకుండా, మరోవైపు తనకున్న అభిరుచులకు అనుగుణంగా అనేక బ్రాహ్మణ సంఘాలలో కీలక పాత్ర పోషిస్తూ ,రాజకీయంగా ఎదుగుతూ ఇటు పురోహితుల ఉత్సాహాన్ని గుర్తించి క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తూ యువ క్రీడాకారులు ఎదిగేందుకు తగిన సహాయ, సహకారాలు అందిస్తూ బ్రాహ్మణ మహిళలకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రఖ్యాతి పొందిన పెందుర్తి ఉత్తరాంధ్ర శబరిమల అయ్యప్పస్వామి ఆలయం, శ్రీ షిరిడి సాయి రక్షామందిర్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయాల అర్చక స్వామి రాజేష్ కుమార్ శర్మ జ్యోతిష్యం, వాస్తు, చండీహోమాలు, రుద్రయాగాలు జరిపించడంతోపాటు, ఆధ్యాత్మిక రంగానికి కృషి సల్పుతూ శర్మ ను గుర్తించి ఉగాది పురస్కారాల సందర్భంగా మార్చి 27న సరిపి.రామన్ ఆధ్వర్యంలో "పురోహిత వైభవ రత్న అవార్డు సత్కరించడం జరిగిందని ఈ కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహించడం జరిగింది.అనంతరం విశాఖపట్నంలో ఉన్న బ్రాహ్మణ సంఘాలు పెద్దలుకు రాజేష్ శర్మ ప్రత్యేక అభినందనలు తెలిపారు.